రేపటి నుంచి శివరామాంజనేయ స్వామి ఆలయ వేడుకలు

మోతీనగర్‌: మోతీనగర్‌లోని శివరామాంజనేయ స్వామి ఆలయంలో శ్రీ జగద్గురు శంకరాచార్య, శ్రీ విద్యారణ్య భారతి స్వామి పర్యవేక్షణలో సోమవారం నుంచి గురువారం వరకు ఆలయ ద్వితీయ వార్షిక వేడకలు నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, కుంభస్థాపన మంగళవారం ఉదయం 9 గంటలకు నిత్య విధి, రుద్రాభిషేకం, రుద్ర హోమం, సామీజీ వారి కరకమలములచే శ్రీ ఆంజనేయ స్వామివారికి 36 కలశములచే అభిషేకం, నాగవల్లి దళార్చన, స్వామివారి అనుగ్రహ భాషణం, బుధవారం ఉదయం 9 గంటలకు గణపతి హోమం, లక్ష్మి హోమం, సాయంత్రం 6 గంటలకు శివపార్వతుల, శ్రీ సీతారాముల, శ్రీ వల్లీ దేవ సేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల కల్యాణం, గురువారం హనుమాన్‌ జయంతి సందర్భంగా నవకలశ స్థపనం, నాగవల్లి దళార్చన, వడమాల సేవ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

సామూహిక ఉపనయనాలు



మోతీనగర్‌: శ్రీశృంగేరి శారద శంకర మఠం బ్రాహ్మణ అభ్యుదయ సమితి ఆధ్వర్యంలో శనివారం మూసాపేట డివిజన్‌ మోతీనగర్‌లోని శ్రీశారద శంకరమఠం ఆవరణలో పలువురికి సామూహిక ఉపనయనం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యుదయ సమితి అధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ అభ్యుదయ సభ్యులు రామచంద్రరావు, అనిత, కొందూరి శంకరనారాయణ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవ పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

కూకట్‌పల్లి: దయార్‌గూడలోని నల్లపోచమ్మ ఆలయ 17వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం వివిధ పూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో పండ్ల పంపిణీ



ఆల్విన్‌కాలనీ: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌ యాదవ్‌ జన్మదినం సందర్భంగా శనివారం నిజాంపేటలోని ఆశ్రేయ ఓల్డ్‌ ఏజ్‌ హోమ్‌ శక్తి సదన్‌లోని వృద్ధులకు, పిల్లలకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ హైదర్‌నగర్‌ డివిజన్‌ అధ్యక్షుడు అరుణ్‌ కుమార్‌, కృష్ణంరాజు, బాబు, నవీన్‌గౌడ్‌, కృష్ణ, సాదమ్మ, బాలాజీ, సునీల్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాడీ పట్టేది నకిలీలే !

అర్హత లేకుండా వైద్యం చేస్తున్న నకిలీ డాక్టర్లు

- బాధితుల ఫిర్యాదులతో 38 ఆసుపత్రుల సీజ్‌
- ప్రైవేటు ఆసుపత్రుల్లో పర్యవేక్షణ లోపం



సాక్షి,సిటీబ్యూరో: అర్హతలు లేకుండా వైద్యం చేస్తూ.. ప్రజల ప్రాణాలు తీస్తున్న నకిలీ వైద్యులపై కేసులు నమోదైన ఘటనలు గ్రేటర్‌తో సహా శివారు మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలో చర్చనీయాంశమవుతోంది.

- మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలో దాదాపు 3,835 పైగా ప్రైవేట్‌, కార్పొరేట్‌ ఆసుపత్రులు ఉండగా.. ఇందులో రిజిస్ట్రేషన్‌తో సహా వివిధ అనుమతితో కొనసాగుతున్న ఆసుపత్రులు 2,840 మాత్రమే ఉన్నాయి. ఈ ఆసుపత్రుల్లో 100 కంటే ఎక్కువ పడకలు (బెడ్స్‌) ఉన్న ప్రైవేట్‌ ఆస్పత్రులు 58 ఉండగా.. 20 నుంచి 100 పడకలు (బెడ్స్‌) ఉన్న ఆస్పత్రులు 417 ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ చెబుతోంది.

అనుమతులు లేనివి అధికం..

20 పడకలు (బెడ్స్‌) ఉన్న ఆసుపత్రులు 594 ఉన్నాయి. 1012 పాలీక్లినిక్‌లు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్‌ సెంటర్లు, 280 డెంటల్‌ ఆసుపత్రులు, 66 ఫిజియోథెరపీ సెంటర్లు, 10 రిహాబిలిటేషన్‌ సెంటర్లు ఉన్నాయి. వీటిలో అనుమతిలేనివి అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది.

సీజ్‌ అయిన ఆసుపత్రులు ఇవే..

బోడుప్పల్‌ నగరపాలక సంస్థ పరిధిలోని చెంగిచర్ల భవిష్యా వెల్‌ విస్పర్‌ ఆసుపత్రిని అర్హత లేని మెడికల్‌ డైరెక్టర్‌, డాక్టర్లు, సిబ్బందితో కొనసాగిస్తున్నట్లు గుర్తించిన వైద్యశాఖ ఇటీవల ఈ ఆసుపత్రి రిజిస్ట్రేషన్‌ను 60 రోజులు సస్పెండ్‌ చేయడంతో పాటు మేనేజ్‌మెంట్‌పై క్రిమినల్‌ కేసులు నమోదు చేసింది. ఆసుపత్రి ప్రాంగణాన్ని స్వాధీనం చేసుకుని, అన్ని వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్‌ ఉపకరణాలను జప్తు చేసింది. ఆసుపత్రి యాజమాన్యానికి రూ.5 లక్షల జరిమానా కూడా విధించింది.

- జగద్గిరిగుట్టలోని హాసిని ఫస్ట్‌ ఎయిడ్‌ క్లినిక్‌ను ఫార్మ్‌డీ అర్హత ఉన్న ప్రతీక్‌ అనే వ్యక్తి నకిలీ జనరల్‌ ఫిజిషియన్‌గా వైద్య చికిత్సలు నిర్వహిస్తున్నట్లు గుర్తించి, ఈ క్లినిక్‌ను సీజ్‌ చేసింది.
- బాచుపల్లిలో ఎలాంటి అర్హతలు లేకుండా కొనసాగుతున్న సహజ పాలీక్లినిక్‌, బుచ్చిబాబు ఫస్ట్‌ ఎయిడ్‌ సెంటర్లను సీజ్‌ చేసింది.
- మల్కాజిగిరి, ఈస్ట్‌ ఆనంద్‌బాగ్‌లో అనుకృష్ణ ఆసుపత్రిని సీజ్‌ చేసిన వైద్యబృందం డీఎం ఆసుపత్రికి నోటీసులు జారీ చేసింది.
- మల్కాజిగిరి ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న శ్రీసాయి ఫస్ట్‌ ఎయిడ్‌ సెంటర్‌, షాదన్‌క్లినిక్‌లను వైద్యాధికారులు సీజ్‌ చేశారు.
- అల్వాల్‌ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న గౌరవి పాలీ క్లినిక్‌, భువన డయాగ్నస్టిక్‌ సెంటర్‌ను సీజ్‌ అయ్యింది.
- బొల్లారంలో క్లినికల్‌ ఎస్టాబ్లిష్‌మెంట్‌ చట్టాన్ని ఉల్లంఘించిన భవాని పోలీక్లినిక్‌ను వైద్య బృందం సీజ్‌ చేసింది. ఈ క్లినిక్‌ అనేక ఏళ్లుగా ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం కలిగించే వైద్యసేవలను అందిస్తున్నట్లు వైద్యశాఖ గుర్తించింది. క్లినిక్‌ నిర్వాహకులు నకిలీ జనరల్‌ ఫిజీషియన్‌గా శక్తివంతమైన యాంటీబయోటిక్స్‌ రాయడం, ఐవీ ఇన్ఫ్యూషన్లు ఇవ్వడం వంటి వైద్యసేవలను అందిస్తున్నట్లు పేర్కొంది.
- మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలో 38 క్లినిక్‌లను సీజ్‌ చేయడంతో పాటు 10 డయాగ్నస్టిక్‌, స్కానింగ్‌, అల్ట్రా సెంటర్లను మూసివేసింది. ప్రభుత్వ నిబంధనలను పాటించని పలు ప్రైవేట్‌ ఆస్పత్రులకు షోకాజ్‌ నోటీసులను కూడా వైద్యారోగ్యశాఖ జారీ చేసింది. ఇదిలా ఉండగా, వైద్యశాఖలో కొందరికి మామూళ్లు అప్పచెబుతున్న పలు ప్రైవేట్‌ ఆసుపత్రుల యజమాన్యం యధావిధిగా నకిలీ వైద్యులతో వైద్య సేవలు సహా చికిత్సలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనుమతి నిబంధనలు ఇలా..

అల్లోపతి ప్రైవేటు మెడికల్‌ కేర్‌ ఎస్టాబ్లిష్‌మెంట్‌ చట్టం ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్‌ సెంటర్లు, కన్సల్టెంట్‌ క్లినిక్‌లు, ఆయుష్‌ క్లినిక్‌లు, పిజియోథెరపీ కేంద్రాలు అన్నింటికీ అనుమతి తప్పనిసరి. ఆసుపత్రి, క్లినిక్‌. డయాగ్నస్టిక్‌ కేంద్రాల నిర్వాహకులు, అందులో పనిచేసే వైద్యుల రిజిస్ట్రేషన్‌ తప్పనిసరిగా ఉండాలి.

- అగ్నిమాపక, బయోవేస్ట్‌ మేనేజ్‌మెంట్‌, పొల్యూషన్‌, మున్సిపల్‌ ట్రేడ్‌ లైసెన్స్‌తో సహా అన్ని రకాల పత్రాలు సరిగ్గా ఉన్నప్పుడే ఆసుపత్రుల ఏర్పాటుకు అనుమతి ఇస్తారు.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

విద్యార్హతలు లేకుండా కొందరు వైద్యం చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే పలు ఆసుపత్రులపై నిఘా పెంచాం. అలాంటి వారిపై క్రిమినల్‌ కేసులు నమోదు చేస్తాం. నకిలీ వైద్యులపై స్థానికులు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్‌ సెంటర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్‌ సి.ఉమాగౌరీ, డీఎంహెచ్‌ఓ, మేడ్చల్‌ జిల్లా

రోడ్డు మధ్యలో అడ్డదిడ్డంగా సిమెంట్‌ దిమ్మెలు

వాహనాలు దిమ్మెలను ఢీకొని ప్రమాదాలు



మోతీనగర్‌: రోడ్డు మధ్యలో సిమెంట్‌ దిమ్మెలు అడ్డదిడ్డంగా ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారు. వాటిని సక్రమంగా క్రమ పద్ధతిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. మోతీనగర్‌ చౌరస్తా నుంచి బోరబండ వైపు వాహనాలు సక్రమంగా వెళ్లడానికి ఇటీవల రోడ్డు మధ్యలో స్నేహపురి కాలనీ కమాన్‌ నుంచి బోరబండ వరకు రోడ్డు మధ్యలో సిమెంట్‌ దిమ్మెలతో అడ్డదిడ్డంగా డివైడర్‌ను ఏర్పాటు చేశారు. సిమెంట్‌ దిమ్మెలను రోడ్డులో ఎక్కడ పడితే అక్కడ ఏర్పాటు చేయడంతో రాత్రి వేళల్లో దిమ్మెలకు వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ రోడ్డు హైటెక్‌ సిటీకి మార్గమధ్య దారి కావటంతో రోడ్డుకు ఇరువైపులా నివసిస్తున్న నివాసితులు సైతం అప్రమత్తంగా రోడ్డు దాటాల్సిందే. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అడ్డదిడ్డంగా ఉన్న సిమెంట్‌ దిమ్మెలను క్రమ పద్ధతిలో ఏర్పాటు చేసి, ప్రమాదాలు జరగకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

దిమ్మెలను క్రమ పద్ధతిలో వేయాలి



రోడ్డు మధ్యలో అడ్డదిడ్డంగా సిమెంట్‌ దిమ్మెలతో డివైడర్‌లను ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డు రాత్రి, పగలు తేడా లేకుండా సాఫ్ట్‌వేర్‌, ఇతర వ్యాపార, ఉద్యోగులు ప్రయాణిస్తుంటారు. సక్రమంగా లేకపోవడంతో వాహనాలు సిమెంట్‌ దిమ్మెలను ఢీకొంటున్నాయి. ఇప్పటికైనా సిమెంట్‌ దిమ్మెలను క్రమ పద్ధతిలో వేయాలి.

– అలెక్స్‌ థామస్‌, బోరబండ

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌

బాలానగర్‌: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ అన్నారు. నియోజకవర్గానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు రూ.4.58 లక్షల విలువ గల చెక్కులను బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో పుష్పారెడ్డి, లక్ష్మయ్య, ప్రకాష్‌, రమేష్‌, చున్ను పాషా, కుక్కల రమేష్‌, అయాజ్‌, అస్లాం, స్వామి, మద్దూరి రాము, బాల నరసింహ, భరత్‌, మధు, రాజ్‌ పటేల్‌ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ తదితరులు

రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు





రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించిన అధికారులు

ట్రాఫిక్‌ ఏసీపీ వెంకటరెడ్డి

మూసాపేట: రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్‌ ఏసీపీ వెంకటరెడ్డి అన్నారు. భరత్‌నగర్‌ కాలనీలోని కూరగాయల మార్కెట్‌కు వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారుల బండ్లను మున్సిపల్‌ అధికారులు, ట్రాఫిక్‌ పోలీసులు శనివారం తొలగించారు. కాలనీలోకి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, రోడ్డు ఇరువైపులా ఆక్రమణకు గురవ్వడంతో ట్రాఫిక్‌ ఇబ్బందులు ఉన్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. మెట్రో వారు ఏర్పాటు చేసిన షాపు ముందు ఉన్న మెట్లు, బండ్ల ఏర్పాటుకు ఉన్న అరుగులను జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా మేడ్చల్‌ జోన్‌ ట్రాఫిక్‌ ఏసీపీ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. చిరు వ్యాపారస్తుల్లో ఉన్న పేద ప్రజలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. స్థానికులు, మార్కెట్‌ కమిటీ, మున్సిపల్‌, పోలీస్‌ అధికారులతో సమావేశం నిర్వహించి ప్రజలకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకుందామని అన్నారు. మరోసారి రోడ్డు ఆక్రమణ చేయకూడదని సూచించారు. వన్‌ వేలో వాహనాల రాకపోకలపై ట్రాఫిక్‌ పోలీసులు సూచించిన మార్గంలో వెళ్లాలని అన్నారు.

రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది

స్పోర్ట్స్‌ అథారిటీ చైర్మన్‌ శివసేనరెడ్డి

చందానగర్‌: సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర స్పోర్ట్స్‌ అథారిటీ చైర్మన్‌ శివసేనరెడ్డి పేర్కొన్నారు.టీపీసీసీ ఆదేశాల మేరకు డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి ,కాంగ్రెస్‌ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్‌ గౌడ్‌ ఆధ్వర్యంలో హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని మదీనాగూడ కిన్నెర హోటల్‌లో శనివారం కార్యకర్తలు, నాయకుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్‌ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలన్నారు. ప్రభుత్వం దశల వారీగా ఎన్నికల హామీలు నెరవేరుస్తుందన్నారు.

టై విజేతగా ఫెమిలియర్‌ ఫేసెస్‌

గచ్చిబౌలి: టై యంగ్‌ ఎంటర్‌ప్రెన్యూర్స్‌ ప్రాంతీయ ఫైనల్స్‌లో ఫెమిలియర్‌ ఫేసెస్‌ జట్టు విజేతగా నిలిచింది. శనివారం గచ్చిబౌలిలోని ప్యూజి కార్యాలయంలో టీఈఐ ఆధ్వర్యంలో 16వ టై యంగ్‌ ఎంటర్‌ప్రెన్యూర్స్‌ (టీవైఐ) ప్రాంతీయ ఫైనల్స్‌ నిర్వహించారు. ఫెమిలియర్‌ ఫేసెస్‌ జట్టు సభ్యులు సాత్విక్‌ రెడ్డి చెన్నా, అభిరాం నోరీ, జగదీష్‌లు విజేతలుగా నిలిచారు. రన్నరప్‌గా ఇంక్లూడ్‌, సెకండ్‌ రన్నర్‌గా ఎర్త్‌వార్మ్‌ జట్లు నిలిచాయి. విజేత జట్టు ఢిల్లీలో జరగనున్న గ్లోబల్‌ టై ఫైనల్స్‌లో ప్రాతినిధ్యం వహిస్తుందని, వైల్డ్‌ కార్డ్‌ ఎంట్రీ ద్వారా రన్నరప్‌ జట్టు పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టీఈఐ (ద ఇండస్‌ ఎంటర్‌ప్రెన్యూర్స్‌) గ్లోబల్‌ చైర్మన్‌ మురళి బుక్కపట్నం, హైదరాబాద్‌ అధ్యక్షులు రాజేష్‌ పగడాల, టీవైఈ హైదరాబాద్‌ అధ్యక్షుడు సుబ్బరాజు పెరిచర్ల తదితరులు పాల్గొన్నారు.



చెరువు పూడికతీత పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ సబిహా బేగం

మోతీనగర్‌: చెరువు పూడికతీత పనులను సత్వరమే పూర్తి చేయాలని కార్పొరేటర్‌ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్‌ డివిజన్‌ పరిధిలోని సున్నం చెరువులో హైడ్రా చేపడుతున్న చెరువుల సుందరీకరణ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా చెరువు పూడికతీత పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో గాయత్రినగర్‌ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణారావు, సంజీవరెడ్డి, జితేందర్‌, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలి



వరదనీటి కాల్వ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్‌: అభివృద్ధి పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేయాలని పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. డివిజన్‌ పరిధిలోని గాయత్రి ఎన్‌క్లేవ్‌ కాలనీ నుండి బొల్లారం మెయిన్‌ రోడ్డు వరకు రూ.కోటి50లక్షలతో నూతనంగా చేపట్టిన వరదనీటి కాల్వ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులు, కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షకాలంలో వరదముంపు సమస్య శాశ్వత పరిష్కారం దిశగా రూ.కోటి50 లక్షలతో కాల్వ పనులను చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అధికారులు డీఈ దుర్గాప్రసాద్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ నవీన్‌, నాయకులు తదితరులున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



మాదాపూర్‌: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం నాద ముద్ర స్కూల్‌ ఆఫ్‌ మ్యూజిక్‌ అండ్‌ డ్యాన్స్‌ గురువు చైతన్య కుసుమప్రియ శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనతో అలరించారు. ఇందులో గణేశపంచరత్న , కౌతం, శృంగారలహరి, సప్తతాండవం, సూర్యాష్టకం, అర్ధనారీశ్వరాష్టకం, తిల్లాన, మంగళం తదితర అంశాలను రీతుపర్ణ, ఆశ్రిత సాయి, హరిణి, అనన్య, తరిణి, నిహారిక, మానస, శ్రీలత, డాక్టర్‌ ఆనంద్‌ మీనన్‌, రమ్యప్రదీప్‌లు ప్రదర్శించారు. డాక్టర్‌ శ్రిష్టి బుధోరి భరతనాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఇందులో దశావతారం, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు.

సమ్మర్‌ ఆర్ట్‌ క్యాంపు .. సర్టిఫికెట్లు అందజేత

సమ్మర్‌ ఆర్ట్‌ క్యాంపులో శిక్షణ పొందినవారు వేసిన చిత్రాలను శనివారం ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను శిల్పారామం ప్రత్యేక అధికారి జి.కిషన్‌రావు ప్రారంభించారు. ఆర్ట్‌ క్యాంపులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్‌లను అందజేశారు.

అన్నమయ్యపురంలో..

అన్నమయ్యపురంలో శనివారం నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శ్రీదీప్తి నృత్యాలయం కూచిపూడి , జానపద నృత్యాలతో అలరించారు. కళాకారులు లక్ష్మిశ్రేష్ఠ, సౌమ్యరెడ్డి, మాన్విత, ప్రియా రెడ్డి, తన్వి, దివ్య, మాన్య, పూర్వికి, శ్రీకరి, దృశిక, ఇ,ఆన్వి, మనస్వి, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు. మూషికవాహిని, వినాయకకౌతం, శ్రీవిఘ్నరాజం భజే, అదివోఅల్లదివో, రామాయణశబ్దం తదితర అంశాలను ప్రదర్శించారు. జానపద నృత్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం కళాకారులకు సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్‌ శోభారాజు జ్ఞాపికలను అందజేశారు.



సౌర విద్యాలయాలు

విద్యుత్‌ ఆదా, పొదుపు చర్యల్లో భాగంగా ఏర్పాటు

రాయదుర్గం: నగర శివారు ఐటీకారిడార్‌ ప్రాంత పరిసరాల్లోని పలు ఉన్నత విద్యాసంస్థల్లో సోలార్‌ వెలుగులు విరజిమ్ముతున్నాయి. సౌర విద్యాలయాలుగా మారాయి. శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి, టెలికామ్‌నగర్‌ పరిధిలోని జాతీయ స్థాయి విద్య, శిక్షణా సంస్థలలో సోలార్‌ విద్యుత్‌ ఉత్పత్తికి శ్రీకారం చుట్టాయి. విద్యుత్‌ వ్యయాన్ని గణనీయంగా తగ్గించేందుకు.. క్యాంపస్‌లలో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించుకునేందు ముందుకుసాగుతున్నాయి. భవిష్యత్‌లో పూర్తిగా సౌరవిద్యుత్‌ వాడడానికి ఆలోచిస్తున్నారు.

- టెలికామ్‌నగర్‌లోని నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టూరిజమ్‌ అండ్‌ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌ (నిథమ్‌)
- గచ్చిబౌలిలోని హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)
- గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్‌ స్టాఫ్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఇండియా
- టెలికామ్‌నగర్‌లోని మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం
- ఎస్కీలో ఖాళీ స్థలంలో కూడా సోలార్‌ ప్యానల్స్‌ ఏర్పాటు చేసి విద్యుత్‌ ఉత్పత్తి చేస్తున్నారు.

నిథమ్‌లో..

- నిథమ్‌లో 35వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 200 కిలోవాట్ల సామర్థ్యం.. సోలార్‌ విద్యుత్‌ ఉత్పత్తిని ప్రారంభించారు.
- క్యాంపస్‌లోని అకడమిక్‌ బ్లాక్‌ భవనం రూఫ్‌టాప్‌పై 60 కిలోవాట్లు, హాస్పిటాలిటీ బ్లాక్‌ భవనంపై 100 కిలోవాట్లు, బాలుర హాస్టల్‌ భవనం –1పై 15 కిలోవాట్లు, బాలుర హాస్టల్‌ భవనం –2పై 25 కిలోవాట్ల సోలార్‌ ప్యానల్స్‌ ఏర్పాటు చేశారు.
- వీటి ద్వారా 140 నుంచి 150 కిలోవాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.
- దీనికోసం రూ.93 లక్షల వ్యయం చేశారు. ఈ సోలార్‌ పవర్‌తో నెలకు రూ.2.50 లక్షల విద్యుత్‌ బిల్లు ఆదా చేస్తున్నారు.
- క్యాంపస్‌కు రోజుకూ 900 యూనిట్ల విద్యుత్‌ అవసరం కాగా సోలార్‌ ద్వారా 1200 యూనిట్ల ఉత్పత్తికి ప్రణాళికలు చేశారు. అదనపు విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించాలని భావిస్తున్నారు.



ఇంజనీరింగ్‌ స్టాఫ్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఇండియాలో ..

ఎస్కీలో..

- గచ్చిబౌలిలోని ఈఎస్‌సీఐలో సోలార్‌ పివి గ్రిడ్‌ ఆఫ్‌ 20 కెడబ్ల్యూపి ఇంటరాక్టివ్‌ పవర్‌ ప్లాంట్‌ను 2015లో ప్రారంభించారు.
- క్యాంపస్‌లోని కౌటిల్య, చాణిక్య భవనాల అవసరాలను తీర్చడానికి సోలార్‌ పవర్‌ను వినియోగిస్తున్నారు.
- 2015లో 80 కెడబ్ల్యూపీ ఇంటర్యాక్టివ్‌ పవర్‌ ప్లాంట్‌ మరో గ్రిడ్‌ను ప్రారంభించారు.
- క్యాంపస్‌లోని పరిపాలనా భవనం, డైనింగ్‌ హాల్‌, కన్సల్టెన్సీ విభాగం విద్యుత్‌ అవసరాలను తీరుస్తున్నారు.

హెచ్‌సీయూలో..

- హెచ్‌సీయూలో మొదట 1.140 మెగావాట్ల సౌర విద్యుత్తును ఉత్పత్తి చేశారు.
- విద్యుత్‌ బిల్లు నెలకు రూ. 14 లక్షల వ్యయం తగ్గింది. 15 శాతం విద్యుత్‌ అవసరాలు తీరుతున్నాయి
- భవిష్యత్తులో 5 మెగావాట్ల సౌర విద్యుత్‌ ఉత్పత్తికి 2 మెగావాట్ల చొప్పున రెండు దశల్లో సామర్థ్యాన్ని పెంచాలని తాజాగా ప్రతిపాదించారు.
- ఇందిరాగాంధీ మెమోరియల్‌ లైబ్రరీపై 100 కేవీ సోలార్‌ పవర్‌ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.



ఉర్దూ విశ్వవిద్యాలయంలో..

- గచ్చిబౌలిలోని టెలికామ్‌నగర్‌లో 200 ఎకరాల్లో విస్తరించిన మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం సోలార్‌ పవర్‌పై దృష్టిపెట్టింది.
- 'మనూ'లో ప్రస్తుతం 500 కేవీఏ విద్యుత్‌ అవసరం. దశలవారీగా పూర్తిగా సౌర విద్యుత్‌ వాడాలని సంకల్పించారు.
- వీసీ ప్రొఫెసర్‌ సయ్యద్‌ ఐనుల్‌ హసన్‌ 2022లో సోలార్‌పవర్‌ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు .
- ఆన్‌ గ్రిడ్‌ మోడ్‌లో 100 కేవీఏ సామర్థ్యం గల సౌర ఫలకాలను ఏర్పాటు చేశారు. మలివిడతలో మిగతా భవనాలపై ఏర్పాటు చేయాలని సంకల్పించారు.